# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 20, జులై 2026


## ఘనంగా బోనాల పండుగ

- గట్టు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- ఆలయ రహదారి నిర్మాణానికి రూ.65 లక్షలు, షెడ్డు కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు

**భైంసా, జులై 19, ప్రభాతవార్త:**



భైంసా పట్టణంలో బోనాల పండుగను పురప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే గట్టు మైసమ్మ అమ్మవారి సన్నిధి జనసంద్రంగా మారింది. పట్టణంలోని గణేష్ నగర్, కిసాన్ గల్లీ, కోర్వగల్లీతో పాటు పలు కాలనీల నుంచి మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, డప్పు చప్పుళ్ల నడుమ బోనాల కుండలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకల్లో ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గట్టు మైసమ్మ తల్లిని మిగతా 2లో..

# అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..



- గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి

**చెన్నూరు, జూలై 19, ప్రభాతవార్త**

ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని, చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధే నాకు ముందున్న లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఉదయం బాలికల వసతి గృహాలను పర్యవేక్షించిన మంత్రి విద్యార్థినుల సమస్యలు అడిగి



తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. విద్యార్థినుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. మున్సిపాలిటీలో కోటి నలభై లక్షల నిధులతో నిర్మించిన నూతన బైపాస్ రోడ్డును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా బైపాస్ రోడ్డు నిర్మాణం చేశామని తెలిపారు. నూతన బైపాస్‌తో భారీ వాహనాల రాకపోకలు సులభతరమని అన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే పనులు ప్రారంభించామని మిగతా 2లో..

## సర్వే ప్రక్రియ తీరును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

- వంద శాతం ఓట్ల నమోదు జరిగేలా చూడాలి: బీఎల్ఏలకు పిలుపు

**భైంసా, జులై 19, ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఆదివారం తానూర్ మండల కేంద్రంతో పాటు ఎల్వి గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదయ్యేలా చూస్తూ, వంద శాతం ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో తానూర్ సర్పంచ్ జాదవ్ సుగంధ మాధవరావు పటేల్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, మాజీ ఆత్మా చైర్మన్ పోతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భీమ్ పవార్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కట్ట మైసమ్మ ఆషాఢ బోనాలు

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 19, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని సర్ సిల్క్ ఏరియాలో శ్రీ కట్ట మైసమ్మ ఆషాఢ బోనాల మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీ కట్ట మైసమ్మ తల్లి చల్లని కటాక్షంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆషాఢ బోనాల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కచ్చుకాయల జ్యోతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాధురి గౌడ్, జాతర కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.



# ఘనంగా బోనాల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

వేడుకున్నట్లు తెలిపారు.

### ఆలయ అభివృద్ధికి నిధుల వరద..

భక్తుల సౌకర్యార్థం గట్టు మైసమ్మ ఆలయ రహదారి నిర్మాణానికి రూ.65 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాబోయే ఆషాడం మాసం నాటికి ఈ రహదారి పనులను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. వీటితో పాటు ఆలయ ఆవరణలో భక్తుల కొరకు షెడ్డు నిర్మాణానికి అదనంగా రూ.10 లక్షల నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించారు. పట్టణంలోని ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాలు ఆరోపించాయని, అనుకున్న సమయానికంటే పనులు ముందుగానే పూర్తి చేశామన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. విస్తరణ పనుల్లో యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కట్టడాలను వారే తొలగింపుకోవడం హర్షణీయమన్నారు. చెన్నూరు పెద్ద చెరువులోని శివాలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. 40 కోట్ల రూపాయలతో చెన్నూరు ప్రజలకు గోదావరి నుంచి తాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## తెలంగాణ మున్నూరు కాపు కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి సన్మానించిన నాయకులు

తాండూర్, జూలై 19, ప్రభాతవార్త :

మండలంలోని ఐబీ, బోయపల్లిల్లో ఆదివారం తెలంగాణ మున్నూరు కాపు కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి పటేల్ ను కాపు నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావా స్వాతి రమేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశం, తాండూరు ఉప సర్పంచ్ కమ్మరి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నవీన్, మాసాడి శ్రీరాములు, కాపు సంఘం నాయకులు పదాల రవి, చీర్ల రాజేశం, ఇందూరి సత్యం, కటకం తిరుపతి, శ్రీనివాస్, పులగం వెంకటేష్, ఇందూరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్, జూలై 19, ప్రభాతవార్త :

ఆషాడ మాసం సందర్భంగా ఆసిఫాబాద్ మండలంలోని దస్నాపూర్ గ్రామంలో ఉన్న పోచమ్మ దేవాలయంలో ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేయించుకున్న ఆమె, జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా యాదవ మిత్రమండలి బోనాల శోభాయాత్ర

### భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మి అమ్మవారికి బోనాల సమర్పణ - పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్

నిర్మల్, జూలై 19, ప్రభాతవార్త:

యాదవ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి బోనాల ఉత్సవం సంప్రదాయబద్ధంగా, భక్తి శోభతో జరిగింది. ఉదయం నుంచే మహిళలు పిండి వంటలు, నైవేద్యాలు సిద్ధం చేసి బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రజల సంక్షేమం, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా యాదవ మిత్రమండలి నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మిత్రమండలి ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలకు సుభిక్షం, సుఖశాంతులు కలగాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్ తో పాటు యాదవ మిత్రమండలి సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.



మహాలక్ష్మి అమ్మవారి బోనాల శోభాయాత్రలో పాల్గొన్న కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్, మిత్రమండలి ప్రతినిధులు, మహిళలు

## దేగాం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- నలుగురు లబ్ధిదారులకు రూ.68,500 ఆర్థిక సహాయం అందజేత
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ సిరం సుష్మారెడ్డి

భైంసా, జూలై 19, ప్రభాతవార్త:



భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్లు భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు, దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ ప్రత్యేక సహకారంతో గ్రామానికి చెందిన షేక్ అజారుద్దీన్‌కు రూ.26,000, సిరం అఖిలరెడ్డికి రూ.18,000, నాగరాజుకు రూ.8,000, మహాగాం నర్సవ్వకు రూ.16,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్లు సర్పంచ్ వివరించారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఎంతో దోహదపడుతుందని, ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. దేగాం గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ, బాధితులకు చెక్కులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




## కెరమెరి ఎస్సైగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరణ

కెరమెరి, జూలై 19,ప్రభాతవార్త :

కెరమెరి పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా ఎ. శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. తాజా బదిలీల్లో భాగంగా కెరమెరి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సుధాకర్ బదిలీపై పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది నూతన ఎస్సై శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు. కొత్త బాధ్యతల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నట్లు సమాచారం.

## బెల్లంపల్లిలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, జూలై 19, ప్రభాతవార్త

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, కంప్యూటర్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ, కామర్స్, టాక్సేషన్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో (ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం) ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పీహెచ్డీ, నెట్, సెట్ వంటి ఉన్నత అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసిన వారికి ప్రస్తుత నియామకంలో ప్రాధాన్యం ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. అలాగే డిగ్రీ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించగలిగే అభ్యర్థులకు అదనపు ప్రాధాన్యం ఉంటుందని, బోధన అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. డెమో మరియు ఇంటర్వ్యూలు ఈనెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు మంచిర్యాలలోని ప్రభుత్వ ఐడి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959269975 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు అందుకున్న డా. కొత్తపల్లి దంపతులు

కాగజ్‌నగర్ రూరల్, జూలై 19, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ పట్టణం లోని సర్‌సిల్క్ ఏరియాలో కొలువై ఉన్న శ్రీ కట్ట మైసమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత డా. కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు శ్రీ కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ కట్ట మైసమ్మ తల్లి చల్లని కటాక్షంతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాల మధ్య జీవించాలని, కాగజ్‌నగర్ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అలాగే బోనాల జాతరను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన జాతర కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ఆలయ సేవకులను డా. కొత్తపల్లి దంపతులు అభినందించారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవనం నిర్మిస్తాం

## - కాగజ్‌నగర్‌లో జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

కాగజ్‌నగర్ రూరల్, జూలై 19, ప్రభాతవార్త :




రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘానికి రెండు ఎకరాల భూమిని కేటాయించి సంఘ భవనాల నిర్మాణం చేపడతామని రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తెలిపారు. ఆదివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరు కాపు సంఘం నూతన జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర అధ్యక్షుడు పట్టం పురుషోత్తం పటేల్‌తో కలిసి ఆయన హాజరై ప్రసంగించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఎన్నో ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో సంఘ భవనాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించి భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా ఐక్యంగా ఉండి తమ హక్కులు, అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి మున్నూరు కాపు అభ్యర్థి విజయం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని సంఘ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మేయర్ ధరణి మధుకర్, రాష్ట్ర నాయకులు గాదె సత్యం, గజ్జి రామయ్య, జిల్లా అధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి జగదం సత్యనారాయణ, కోశాధికారి మనిగొండ వెంకటేష్, మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు అడప సతీష్, తాలూకా అధ్యక్షులు గాజుల జక్కయ్య, సుంకరి తిరుపతి, మహిళా అధ్యక్షురాలు ఎమ్మాజీ శారదతో పాటు పలువురు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




ఎన్నుకున్న నూతన కమిటీతో శ్యామ్ నాయక్, విబి రావు, జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్

## ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో ఐఎన్టీయూసీ నూతన కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్ టౌన్, జూలై 19: ప్రభాతవార్త :

ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం మీటింగ్ హాల్‌లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, ఐఎన్టీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.బి. రావు (ఎస్‌డబ్ల్యూయూ), జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పీఆర్సీ అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా శ్యామ్ నాయక్, చైర్మన్‌గా గుండ శ్రీనివాస్, డిపో అధ్యక్షుడిగా తన్నీరు బుచ్చయ్య, కార్యదర్శిగా జాడి శంకర్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులు, నూతన కమిటీ సభ్యులకు శాలువ కప్పి సన్మానించారు.

## డిగ్రీ ప్రవేశాలకు మరో ప్రత్యేక అవకాశం

### - 20 నుంచి 26 వరకు దోస్త్ ద్వారా నమోదు

కాగజ్‌నగర్ రూరల్, జూలై 19, ప్రభాతవార్త :

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఇప్పటి వరకు డిగ్రీలో ప్రవేశం పొందని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రత్యేక అవకాశం కల్పించినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. ఈ నెల 20 నుంచి 26 వరకు దోస్త్ ద్వారా నమోదు చేసుకుని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చని ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు ఏ కళాశాలలోనూ సీటు లభించని విద్యార్థులు, ఇంకా డిగ్రీలో చేరని వారు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు, ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7013607011, 9440194179 నంబర్లను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి పేర్కొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా అనుమండ్ల విక్రం ఎన్నిక

తాండూర్, జులై 19, ప్రభాతవార్త :

మంచిర్యాల జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా తాండూర్ మండలం కిష్టంపేట ఉపసర్పంచ్ అనుమండ్ల విక్రమ్ ఎన్నికైనారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ప్రధాన కార్యదర్శి మెరుగు జంపన్న సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, స్రవంతి, రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా రాజేశ్వరి, కార్యదర్శిగా రాజ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ ఫోరం కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కటకం స్వప్న, కార్యదర్శులు ఎరుకల పల్లవి, భీమేష్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్, మంచిర్యాల జిల్లాలోని ఉప సర్పంచులు పాల్గొన్నారు.



ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన విక్రమ్ ను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

## కిష్టంపేటలో పెద్దమ్మ తల్లి బోనాలు

తాండూర్, జులై 19, ప్రభాతవార్త :

మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కులస్తులు, మహిళలు ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు, చప్పులు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని వాడవాడల తిరుగుతూ పెద్దమ్మ తల్లి ఆలయానికి తరలి వెళ్లారు. భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించికుటుంబాలు చల్లగా చూడాలని,సమృద్ధిగా వర్షాలు కురవాలని, తమ మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మ తల్లి బోనాలతో పండుగ వాతావరణ సంతరించుకుంది.





త్రాగు నీటి బోర్లకు కొబ్బరికాయ కొడుతున్న దృశ్యం

## నీల్వాయిలో నాలుగు త్రాగునీటి బోర్ల పనుల ప్రారంభం

వేమనపల్లి, జూలై 19, ప్రభాతవార్త

నీల్వాయి గ్రామంలో త్రాగునీటి సమస్య నివారణకు రూ.10 లక్షల వ్యయంతో నాలుగు కొత్త బోర్ల ఏర్పాటు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంజూరు చేసిన నిధులతో ఒక్కో బోరును రూ.2.50 లక్షల చొప్పున నిర్మించనున్నారు. బోర్ల పనులను మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య ప్రారంభించారు. గ్రామంలోని అన్ని వార్డులకు తగిన త్రాగునీరు అందించడమే ఈ పనుల లక్ష్యమని వారు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి మధు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చెన్నూరు వాకర్స్ సొసైటీ శ్రమదానం

### - గోదావరి తీర ప్రాంతంలో ప్లాస్టిక్, గాజుపెంకుల ఏరివేత

### - వాకర్స్ సభ్యులను అభినందించిన పట్టణ ప్రజలు

చెన్నూరు, జూలై 19, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు సమీపంలోని గోదావరి తీరంలో స్థానిక వాకర్స్ సొసైటీ సభ్యులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. గోదావరి తీర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, పంచక్రోశ ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న చెన్నూరు గోదావరి తీరం భక్తులకు అత్యంత పవిత్రమైనదని తెలిపారు. ప్రతి రోజూ పుణ్యస్నానాలు, కర్మకాండలు, దహన సంస్కారాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుండగా, కొందరు వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్లడం వల్ల తీరం అపరిశుభ్రంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వాకర్స్ సొసైటీ సభ్యులం అందరం చర్చించి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా శ్రమదానం చేసి వ్యర్థాలను తొలగించామని పేర్కొన్నారు. వాకర్స్ సభ్యులు చేసిన మంచి పనికి పట్టణ ప్రజలు అభినందించారు.

## 34వ డివిజన్‌లో వైభవంగా ఆషాడ బోనాలు

### - పోచమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

నస్పూర్, జూలై 19, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్‌లో ఆషాడ బోనాల జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖను స్థానిక డివిజన్ ప్రజలు, నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. స్థానిక కాలనీల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, స్థానిక కార్పొరేటర్ అగ్గు సాగర్, 36వ డివిజన్ కార్పొరేటర్ అగల్ డ్యూటీ రాణి, పట్టణ మహిళా అధ్యక్షురాలు గజ్జల హేమలత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా అల్ఫోర్స్ ఆరంభ్ వేడుకలు

- ✪ విద్య, విలువలు, వినోదం కలగలిపిన మహోత్సవం
- ✪ వేదికపై వైభవం, విద్యార్థుల్లో ఉత్సాహం
- ✪ మంచిర్యాలలో అద్భుత దృశ్యం





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 19, ప్రభాతవార్త**

విద్యార్థుల జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ, లక్ష్యసాధన దిశగా తొలి అడుగులు వేయించే ఉత్సవంగా నిలిచిన ఆరంభ్ వేడుకలు మంచిర్యాలలో అట్టహాసంగా జరిగాయి. ఐఐటీ, నీట్ వంటి అత్యున్నత పోటీ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో విశిష్ట గుర్తింపు పొందిన అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫ్రెషర్స్ వేడుకలు విద్యా వైభవానికి ప్రతీకగా నిలిచాయి. పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపం ఆదివారం రోజున విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహభరితంగా మారింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హాజరుకాగా, గౌరవ అధ్యక్షులుగా అల్ఫోర్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బొకేలు అందజేసి అతిథులకు ఘన స్వాగతం పలికారు. వేడుక ప్రారంభం నుంచే ప్రాంగణం విద్యార్థుల సందడి, ఆకర్షణీయ అలంకరణలు, సంగీత నినాదాలతో కళకళలాడింది. కార్యక్రమం సందర్భంగా అల్ఫోర్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో అల్ఫోర్స్ సాధించిన విజయాలను విశదీకరించారు. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ఆల్ ఫోర్స్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. విద్యార్థులలో పోటీ భావన, క్రమశిక్షణ, సమయపాలనను పెంపొందించడం ద్వారా వారిని విజయపథంలో నడిపించడం మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల అల్ఫోర్స్ కాలేజ్ అన్ని విభాగాల్లో అగ్రగామిగా నిలిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అకాడమిక్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ర్యాంకులు సాధించిన వారిని వారి తల్లిదండ్రులతో కలిసి వేదికపైకి ఆహ్వానించి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విజయాలను అందరూ చప్పట్లతో అభినందించగా, ఈ సన్మానం వారికి మరింత ప్రేరణగా నిలిచింది. తల్లిదండ్రుల కళ్లలో గర్వం, విద్యార్థుల ముఖాల్లో ఆనందం స్పష్టంగా కనిపించింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, విలువలు, సమాజపట్ల బాధ్యతను అలవర్చుకోవాలి. అల్ఫోర్స్ వంటి సంస్థలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థి దేశానికి ఆదర్శంగా నిలవాలి అని ఆయన పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని నిరంతరం కృషి చేస్తే విజయాలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గేయాలు, వినోదాత్మక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఫ్రెషర్స్ పార్టీగా ప్రారంభమైన ఈ వేడుకలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వేదికగా మారాయి. ఆటపాటల మధ్య విద్యార్థులు తమ స్నేహబంధాలను మరింత బలపరుచుకున్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు కలిసి ఈ వేడుకలను విజయవంతం చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. మొత్తంగా ఆరంభ్ వేడుకలు విద్యార్థుల జీవితాల్లో కొత్త ఆరంభానికి సంకేతంగా నిలిచి, విద్య, వినోదం, ప్రేరణల సమ్మేళనంగా గుర్తింపు పొందాయి. మంచిర్యాల విద్యా రంగంలో ఈ కార్యక్రమం ప్రత్యేక మైలురాయిగా నిలిచి, భవిష్యత్తులో మరిన్ని విజయాలకు నాంది పలికింది.















